సాక్షి నంద్యాల
శుక్రవారం। 29। ఆగస్టు। 2025



.. మరో విద్యుత్ పోరాటం

మరో విద్యుత్ పోరాటానికి సిద్ధమవుతామని వామపక్ష పార్టీల నేతలు హెచ్చరించారు. గతంలో విద్యుత్ ఉద్యమకారుల ప్రాణాలు తీసిన దుర్మార్గుడు చంద్రబాబు అని విమర్శించారు. 8లో▸



.. ముగ్గురు మృత్యువాత

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. పొలాల్లో పనిచేస్తుండగా వీరిని పాములు కాటు వేశాయి. చికిత్స పొందుతూ ఒకరు, ఆస్పత్రికి వెళ్తూ ఇద్దరు మృతి చెందారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:19,617
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:19,412

న్యూస్‌రీల్

శ్రీశైలంలో మృత్తికా గణపతికి విశేష పూజలు



సాక్షిగణపతి ఆలయం వద్ద మృత్తికాగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం తొమ్మిది రోజుల పాటు నిర్వహించే గణపతి నవరాత్రోత్సవాలు బుధవారం శ్రీశైలంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానాచార్యులు, అర్చకులు, వేదపండితులు, దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు దంపతులు సంప్రదాయబద్ధంగా ఆలయ ప్రాంగణంలోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేసి ఉత్సవాలను ప్రారంభించారు. పుణ్యాహవచనం, కంకణాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపించి కంకణ ధారణ జరిపించారు. ఉత్సవాల్లో భాగంగా సాక్షిగణపతి ఆలయంలో నెలకొల్పిన వరసిద్ధి వినాయకస్వామి (మృత్తికాగణపతి స్వామి)కి విశేషంగా పూజాదికాలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు ఆలయ ప్రాంగణంలోని రత్నగర్భగణపతి స్వామికి విశేషంగా అభిషేకం, అర్చనలు జరిపిస్తారు. యాగశాలలో అధిష్టింపజేసిన కాంస్య గణపతి మూర్తికి కూడా విశేష పూజలు చేస్తారు. సాక్షి గణపతి ఆలయంలోని స్వామివారికి ప్రత్యేక అభిషేకం, విశేష అర్చనలు నిర్వహిస్తారు.

తలనీలాలతో రూ. 51లక్షల ఆదాయం

పాణ్యం: తలనీలాల వేలంపాటతో కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయానికి రూ. 51.77 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ రామకృష్ణ విలేకరులకు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఆలయ ప్రాంగణంలో తలనీలాలు ఏడాది పాటు పోగు చేసుకునేందుకు బహిరంగ వేలం పాట నిర్వహించామన్నారు. మొత్తం13మంది పాల్గొనగా బనగానపల్లె పట్టణానికి చెందిన బాలాంజినేయులు హెచ్చు పాట పాడి దక్కించుకున్నట్లు తెలిపారు. గతేడాది రూ. 42లక్షల ఆదాయం వచ్చినట్లు చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): వయోజన విద్యాశాఖలో పర్యవేక్షకులుగా పని చేసేందుకు ఉపాధ్యాయులు, భాషా పండితులు, పీఈటీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి వయోజన విద్య చైర్‌పర్సన్, జాయింట్ కలెక్టర్ నవ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 5 పర్యవేక్షక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 45 సంవత్సరాల కంటే తక్కువగా ఉన్న వారు డిప్యూటేషన్ అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 9849909213, 8008843200 నంబర్లను సంప్రదించాలన్నారు.

మాతాశిశు సంరక్షణకు కృషి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

గోస్పాడు: మాతాశిశు సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. నంద్యాల పట్టణంలోని ఎన్‌జీఓ కాలనీలో ఉన్న యూపీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి పునరుత్పత్తి, శిశు ఆరోగ్యం 2.0 కొత్త వర్షన్‌పై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పోర్టల్‌లో గర్భవతులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అందిస్తున్న సేవలు నమోదు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. సకాలంలో వైద్య సేవలు అందించి మాతాశిశు మరణాలు అరికట్టాలన్నారు. జిల్లా అధికారులు డాక్టర్ సుదర్శన్‌బాబు, డాక్టర్ అంకిరెడ్డి, డీపీఓ నాజ్నీన్, ఎస్‌ఓ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు

డోన్ టౌన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో డోన్‌కు కేంద్రీయ విద్యాలయం మంజూరైంది. ఈ విద్యా సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు మండల విద్యాధికారి ప్రభాకర్ గురువారం విలేకరులకు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 1 నుంచి 5వ తరగతి వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. డోన్ ప్రభుత్వ ఐటీఐలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కార్యాలయంలో నేటి నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. సెప్టెంబర్ 11న లాటరీ పద్ధతిలో డ్రా తీసి 12వ తేదీ తుది జాబితా ప్రకటిస్తామన్నారు. 15.09.2025 నుంచి 20.09.2025 వరకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

డీఎస్సీలో సాంకేతికమక

అహోరాత్రులు కష్టపడి చదివి ర్యాంకు సాధించినా ఉపాధ్యాయ ఉద్యోగానికి ఎంపికయ్యారని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు లేఖ రాలేదు. ఇలాంటి వారు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 127 మంది ఉన్నారు. లేఖలు అందుకుని సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చిన వారికి సాంకేతిక సమస్యలు మళ్లీ పరీక్ష పెట్టాయి. మధ్యాహ్నం వరకు వెబ్‌సైట్ పనిచేయకపోవడం, ఆ తర్వాత వచ్చినా ఆలస్యం కావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- సర్టిఫికెట్ల పరిశీలనలో సాంకేతిక సమస్యలు
- మధ్యాహ్నం వరకు పనిచేయని వెబ్‌సైట్
- తరువాత ఓపెన్ అయినా ఆలస్యమే
- ఆర్‌యూలోని కేంద్రంలో ఇంటర్నెట్ సదుపాయం కరువు
- ఆందోళనలో డీఎస్సీ పరీక్ష రాసిన యువతీ, యువకులు



ఇంటర్‌నెట్ లేక రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కేంద్రంలో అధికారుల ఇబ్బందులు, డీలాగా కూర్చున్న డీఎస్సీ విజేతలు



కాల్ లెటర్లు, సర్టిఫికెట్లు తీసుకొచ్చినా పిలుపు రాకపోవడంతో నిరాశగా...

కర్నూలు సిటీ: డీఎస్సీలో ర్యాంకులు సాధించి ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారి సర్టిఫికెట్ల పరిశీలన గురువారం నుంచి ప్రారంభం అయ్యింది. ఉదయం 9 గంటలకు ప్రారంభం కాగా.. మధ్యాహ్నం వరకు వెబ్‌సైట్ పనిచేయలేదు. సాంకేతిక సమస్యలతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఇంటర్నెట్ సదుపాయం లేదు. అధికారుల సమన్వయలోపంతో ఇంటర్నెట్ పని చేయలేదు. అన్ని కేంద్రాల్లో సెల్‌ఫోన్‌లోని హాట్‌స్పాట్‌ను ఓపెన్ చేసుకొని వెరిఫికేషన్‌ను ప్రారంభించినా వెబ్‌సైట్ ఆప్‌అండ్ డౌన్ అయ్యింది. దీంతో రెండున్నర గంటల పాటు సర్టిఫికెట్ల పరిశీలన నిలిచిపోయింది. తర్వాత తాత్కాలిక ఇంటర్నెట్ సదుపాయాన్ని వాడుకున్నా వెబ్‌సైట్ ఫ్రీక్వెన్సీ తక్కువగా ఉండడంతో సర్టిఫికెట్ల పరిశీలనకు ఒక్కొక్కరికి అర గంటకుపైగా సమయం పట్టింది. రాత్రి 8 గంటలైనా కూడా వెరిఫికేషన్ పూర్తి కాలేదు. దీంతో అభ్యర్థులు రాత్రి వేళల్లో శ్రీలక్ష్మీ శ్రీనివాస బీఈడీ కాలేజీలోని కేంద్రంలో ఇబ్బందులు పడ్డారు.

క్యాటగిరీ కటాఫ్ జాబితాపై స్పష్టత ఏదీ?

డీఎస్సీ ప్రకటన జారీ చేసిన సమయంలో అత్యంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. కానీ పరీక్షల షెడ్యూల్ నుంచి కీ, ఫైనల్ కీ, మెరిట్ జాబితా విడుదల అన్నింటిలోనూ అభ్యర్థులకు అనుమానాలు..ఆందోళనలే! ఉమ్మడి జిల్లాలో 2,645 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా దరఖాస్తులు చేసుకున్న వారెందరనే విషయమే ఇంత వరకు ప్రకటించలేదు. ఫైనల్ సెలక్షన్ జాబితా లేకుండా ఎంపికైన అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపించి వెరిఫికేషన్ చేస్తున్నారు. గురువారం 2,307 మందికి కాల్ లెటర్లు ఇవ్వగా..రాత్రి 8 గంటల వరకు 1,639 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన చేశారు. శుక్రవారం 211 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనను శ్రీలక్ష్మీ శ్రీనివాస బీఈడీ కాలేజీలో నిర్వహించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇంకా 127 మంది అభ్యర్థులకు కాల్ లెటర్లు రాలేదని విద్యాశాఖ వర్గాల గణాంకాలు చెబుతున్నాయి. అదే విధంగా ఇంత వరకు ఏ క్యాటగిరీలో ఎంత కటాఫ్ అనే జాబితాలు విడుదల చేయలేదు. ఆ జాబితాల కోసం ఎంతో మంది ఎదురు చూస్తున్నారు.

'ప్రథమ' వేదన

ఏ డీఎస్సీలో లేని విధంగా కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీలో ప్రథమ నిబంధన అమలు చేసింది. ప్రథమ పోస్టులో ర్యాంకు వస్తే అదే తీసుకోవాలి. మిగతా పోస్టుల్లో ర్యాంకు వచ్చినా ఉద్యోగం ఇవ్వరు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనతో జోనల్ స్థాయి పీజీటీ, టీజీటీ, ప్రిన్సిపాల్, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ చాలా మంది పొందలేని పరిస్థితి నెలకొంది. ఎస్‌జీటీగా పని చేస్తూ స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాలంటే 15 ఏళ్లకుపైగా సమయం పడుతుంది. కానీ టీజీటీ సాధించిన వారు ఐదేళ్లలోనే పీజీటీగా పదోన్నతి పొందే అవకాశం ఉంటుంది.

లోపాలు ఇవీ...

☛ మే 15వ తేదీ 2025 లోపు పోస్టు నిర్దేశించే విద్యార్హతలు పూర్తి చేసిన వారు మాత్రమే ఉద్యోగాలకు అర్హులు. దీని ప్రకారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో మే 15, 2025న బీఈడీ ఫలితాలు ప్రకటించారు. అదే నెల 21న సర్టిఫికెట్లు జారీ చేశారు. మే 15న ఫలితాలు వచ్చాయని, వెరిఫికేషన్‌కు అనుమతించాలని కోరినా.. విద్యాశాఖ కమిషనర్ నుంచి ఎలాంటి సమాధానం రాలేదు.

☛ అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలో 2022-24 విద్యా సంవత్సరంలో బీఈడీ చేశారు. అయితే వర్సిటీ అకడమిక్ ఇయర్‌లో పరీక్షలు నిర్వహించలేకపోవడంతో ఓ అభ్యర్థి స్కూల్ అసిస్టెంట్ పోస్టును పొందలేక పోయారు.

☛ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎక్స్ సర్వీస్‌మెన్ కోటాలో 1, 3వ ర్యాంకు వచ్చిన వారికి కాల్ లెటర్ వచ్చింది. అయితే 2వ ర్యాంకు వచ్చిన అభ్యర్థికి కాల్ లెటర్ రాలేదు.

వెరిఫికేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన జేసీ

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న రాయలసీమ యూనివర్సిటీ , శ్రీలక్ష్మీశ్రీనివాస బీఈడీ కాలేజీ, రాఘవేంద్ర బీఈడీ కాలేజీల్లోని కేంద్రాలను జాయింట్ కలెక్టర్ బి.నవ్య, జిల్లా పరిశీలకులు పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ అబ్రహం, వయోజన విద్య అడిషనల్ డైరెక్టర్ బి.ప్రతాప్ రెడ్డి తనిఖీ చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌పై వారు డీఈఓ శ్యాముల్ పాల్‌కు పలు సూచనలు చేశారు.



సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ నవ్య



'సప్త' శోభితం

జిల్లా ప్రజలు వినాయక చవితి పండుగను వైభవంగా నిర్వహించారు. నంద్యాలలో సప్త గవ్వలతో ఏర్పాటు చేసిన విశ్వశాంతి మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు.

– నంద్యాల(వ్యవసాయం)

దివ్యాంగుల పింఛన్లపై వెనక్కు తగ్గిన ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్): అనర్హత పేరిట దివ్యాంగుల పింఛన్లకు ఎసరు పెట్టడంపై సర్వత్రా విమర్శలు, ఆందోళనలు వెల్లువెత్తుతుండటంతో కూటమి ప్రభుత్వం వెనక్కు తగ్గినట్లుగా కనిపిస్తోంది. సెప్టెంబర్ నెలకు సంబంధించి పింఛన్ల పంపిణీకి కోత లేకుండానే నిధులు విడుదల చేసింది. ఆగస్టు నెలకు ఉమ్మడి జిల్లాలో 4,55,168 పింఛన్లు ఉండగా.. సెప్టెంబరు నెలకు ఉమ్మడి జిల్లాలో 4,54,653 పింఛన్లకు రూ.196.01 కోట్లు విడుదల చేసింది. నిధుల మంజూరును పరిశీలిస్తే 515 పింఛన్లకు కోత పడ్డాయి. అయితే ఈనెల 31న కచ్చితంగా ఎన్ని పింఛన్లు సెప్టెంబర్ 1న పంపిణీ చేస్తారనే విషయమై స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 8,400 దివ్యాంగుల పింఛన్లకు అనర్హత పేరుతో నోటీసులు ఇచ్చారు. వందలాది దివ్యాంగుల పింఛన్లను వృద్ధాప్య పింఛనుగా మార్పు చేశారు. వీటి భవితవ్యం ఈ నెల 31 లేదా సెప్టెంబర్ 1వ తేదీన తెలియనుంది.

పెట్టుబడి వేలల్లో.. ధర వందల్లో!



☛ ఈ చిత్రంలోని రైతు పేరు నడిపి మద్దిలేటి. కర్నూలు మండలం ఆర్‌కే దుద్యాల గ్రామానికి చెందిన ఈ రైతు ఎకరాలో ఉల్లి సాగు చేశారు. దాదాపు రూ.80 వేలు పెట్టుబడి పెట్టగా.. దిగుబడి 36 క్వింటాళ్లు(78 ప్యాకెట్లు) వచ్చింది. ఈ నెల 25న రాత్రి మార్కెట్‌కు తీసుకురాగా, 26న టెండర్‌కు పెట్టారు. వ్యాపారులెవ్వరూ కొనుగోలు చేయలేదు. గురువారం మధ్యాహ్నం వరకు కూడా వ్యాపారులు ఈ రైతు తెచ్చిన ఉల్లిని పట్టించుకోలేదు. ఇక దళారీలు బేరం చేయడంతో 36 క్వింటాళ్లను రూ.5వేలకు తెగనమ్ముకున్నాడు. తూకం అయ్యాక దళారీలు రూ.500 కోత పెట్టి రైతు చేతిలో రూ.4,500 మాత్రమే పెట్టడం గమనార్హం.



కుళ్లిన ఉల్లిగడ్డలను పారబోస్తున్న దృశ్యం

ఉల్లి రైతు కంట కన్నీరు

- క్వింటా ఉల్లి రూ.100 నుంచి రూ.150తో కొంటున్న దళారీలు
- టెండరుతో లభించిన ధర రూ.500 నుంచి రూ.800 వరకే

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి రైతుల పరిస్థితి దారుణంగా ఉంటోంది. దిగుబడులను కర్నూలు మార్కెట్‌కు తీసుకెళితే న్యాయం జరుగుతుందని ఆశించిన రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. రోజుల తరబడి మార్కెట్‌లో ఉండలేక, కుళ్లిపోతుంటే చూడలేక దళారీలకు బొట్లకు అమ్ముకొని మార్కెట్ నుంచి కన్నీళ్లతో బయటపడుతున్నారు. ఎకరాకు సగటున రూ.80 వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతోంది. దిగుబడులు కనిష్టంగా 25 క్వింటాళ్లు, గరిష్టంగా 50 క్వింటాళ్ల వరకు వస్తోంది. క్వింటాకు కనీసం రూ.2వేల ధర లభిస్తేనే పెట్టుబడి దక్కుతుంది. కానీ మార్కెట్‌లో లభిస్తున్న ధరలు రైతులకు కంటతడి పెట్టిస్తున్నాయి. గురువారం ధరలు మరింత పతనమయ్యాయి. క్వింటాకు కనిష్ట ధర రూ.520, గరిష్ట ధర రూ.1,149 మాత్రమే లభించింది. ఈ గరిష్ట ధర కేవలం ఒకటి, రెండు లాట్లకు మాత్రమే. సగటు ధర రూ.739 నమోదైందంటే ఎక్కువ మంది రైతులు తెచ్చిన ఉల్లికి కేవలం రూ.500 నుంచి రూ.800 వరకు మాత్రమే ధర లభించినట్లు తెలుస్తోంది.

రూ.100–రూ.150 ధరతోకొంటున్న దళారీలు

మార్కెట్ కమిటీ నుంచి లైసెన్సులు పొందిన వ్యాపారులు కొనుగోలులో చేతులెత్తేయడంతో దళారీలు కారుచౌకగా కొంటున్నారు. క్వింటా ఉల్లి గడ్డలను రూ.100 నుంచి రూ.150తో కొంటున్నారు. ఈ పరిస్థితి ఒకరిద్దరిది కాదు.. మార్కెట్‌కు ఉల్లిగడ్డలు తెచ్చిన రైతుల్లో 50 శాతం మంది దళారీలకే అప్పగించి పోతున్నారు.

భారీ వర్షం.. నిలిచిన రాకపోకలు




ఆత్మకూరు సమీపంలో బ్రిడ్జిపై ఎక్కి పారుతున్న భవనాశి వాగు



నీటిలో మునిగిన మొక్కజొన్న పంట

అత్మకూరురూరల్/అత్మకూరు: నల్లమల అడవుల్లో బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆత్మకూరు మండలంలో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నీటమునిగి వందలాది ఎకరాల్లో మొక్కజొన్న, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అలాగే ఆత్మకూరు నుంచి కొత్తపల్లె మండలానికి వెళ్లే అవకాశం లేకుండా పోయింది. ఆత్మకూరు మండలంలో భవనాశి కొండవాగు ఉధృతంగా ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మునిమడుగులేరుకు నీటి ప్రవాహం పెరిగింది. ఈ వాగుపై నిర్మించిన శివభాష్యం సాగర్ క్రస్ట్ గేట్లలో రెండింటిని ఎత్తివేశారు. ప్రాజెక్ట్ నుంచి విడుదలైన వరద జలాలు నేరుగా భవనాశి వాగులోకి రావడంతో ఆ వాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో ఈ వాగుపై కట్టిన అన్ని కల్వర్టులు, బ్రిడ్జిల పైన వాగు ప్రవహించడంతో కురుకుంద, కొట్టాల చెర్వు, వడ్లరామాపురం గ్రామాలకు పూర్తిగా రాకపోకలు బంద్ అయ్యాయి. ఆత్మకూరు సమీపంలో భవనాశి వాగుపై ఉన్న బ్రిడ్జిపై కూడా నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో మొత్తం కొత్తపల్లె మండలానికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కొత్తపల్లి మండలంలోని 20 గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. రహదారులపై వరద నీరు ఎక్కి పారుతున్న చోట్ల ఆత్మకూరు అర్బన్ సీఐ రాము నేతృత్వంలో పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు.



శివభాష్యం ప్రాజెక్ట్ రెండు గేట్ల నుంచి పారుతున్న వరదనీరు

నంద్యాల జిల్లాలో వర్షపాతం వివరాలు..

నంద్యాల(అర్బన్): నంద్యాల జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు వర్షం కురిసింది. శ్రీశైలంలో అత్యధికంగా 78.4మి.మీ వర్షం కురియగా కోవెలకుంట్ల, గోస్పాడు మండలాల్లో అత్యల్పంగా 1.0 మి.మీ వర్షం కురిసింది. నందికొట్కూరులో 41.8, పగిడ్యాల 36.8, మిడుతూరు 34.2, వెలుగోడు 33.6, జూపాడుబంగ్లా 28.8, ఆత్మకూరు, పాములపాడు 26.8, కొత్తపల్లి 22.8, గడివేముల 20.4, రుద్రవరం 5.4, దొర్నిపాడు 3.8, మహానంది 3.6, బండిఆత్మకూరు 2.2, చాగలమర్రి 1.4, శిరివెళ్ల 1.2 మి.మీ వర్షం కురిసింది.

'బీ' ట్యాక్స్‌కు విద్యుత్ అధికారి బలి!

- ఆళ్లగడ్డ విద్యుత్ శాఖ ఏఈ సస్పెన్షన్
- లాడ్జీలకు కరెంట్ ఇవ్వాలని టీడీపీ నేత హుకుం
- అందుకు ఒప్పుకోని కొందరు యజమానులు
- విద్యుత్ కట్ చేయించిన వైనం
- తప్పు ఒకరిది అయితే.. మరికొకరిపైన రాష్ట్ర ప్రభుత్వం చర్యలు!



వెంకట కృష్ణయ్య, విద్యుత్ శాఖ ఏఈ

ఆళ్లగడ్డ: అహోబిలంలోని 'బీ' ట్యాక్స్ వ్యవహారం ఒక అధికారిపై వేటు పడేలా చేసింది. టీడీపీ నేత తప్పు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌శాఖ అధికారిపై చర్యలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. అహోబిలంలోని లాడ్జీల యజమానులతో ఒక్కక్కరితో రూ. 50 లక్షలు 'బీ' ట్యాక్స్ వసూలు చేయాలని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ముఖ్యమైన టీడీపీ నేత నిర్ణయించారు. కొందరు లాడ్జీల యజమానులు ఇందుకు ఒప్పుకోలేదు. దీంతో వారి లాడ్జీలకు విద్యుత్ కట్ చేయించారు. దీంతో బాధితులు విద్యుత్ శాఖ మంత్రికి, సీఎండీకి ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి టీడీపీ నేతను ఏమీ అనకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆళ్లగడ్డ విద్యుత్ ఏఈ వెంకట కృష్ణయ్యను సస్పెండ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. గతంలోనూ టీడీపీ నేత చెప్పారని రూ. లక్షలు విలువ చేసే ఇసుకను రాత్రికి రాత్రి అదే పార్టీకి చెందిన వారికి ఎత్తిచ్చిన కేసులో అప్పటి హౌసింగ్ ఏఈని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే!

ఏం జరిగిందంటే..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నేత చెప్పిందే శాసనం అన్న విధంగా అధికారులు జీ హుజూర్ అంటూ వస్తున్నారు. అహోబిలంలోని లాడ్జీల యజమానుల్లో ఒక్కొక్కరి నుంచి రూ. 50 లక్షలు 'బీ' ట్యాక్స్ వసూలు చేయాలని గుంటూరు శీనుకు అప్పగించారు. లాడ్జీల యజమానులు ఎవరూ స్పందించక పోవడంతో అధికారులపై చిందులు తొక్కారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను రంగంలోకి దించి నోటీసులు జారీ చేశారు. అయినా స్పందించక పోవడంతో విద్యుత్ అధికారులతో లాడ్జిలకు విద్యుత్ కట్ చేయిస్తూ వేధించడం మొదలు పెట్టారు. దీంతో కొందరు ట్యాక్స్ కట్టారు. బీ ట్యాక్స్ కట్టిన వారిని వదిలి పెట్టి మిగత లాడ్జీల కరెంట్ కట్ చేయాలని అధికారులను ఆదేశించారు. విత్యుత్ సరఫరా కట్ చేయడంతో దిక్కుతోచని కొందరు లాడ్జీల యజమానులు విద్యుత్ శాఖ మంత్రికి, సీఎండీకి ఫిర్యాదు చేశారు. దీంతో సీఎండీ నేరుగా జిల్లా అధికారులతో మాట్లాడి ఏఈతో పాటు కట్ చేసేందుకు వెళ్లిన ఇతర సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెంటనే ఏఈని సస్పెండ్ చేసి ఇందులో ఎవరెవరి పాత్ర ఉందని అన్ని శాఖల అధికారులపై శాఖ పరమైన విచారణకు ఆదేశించారు. లాడ్జీలకు అనుమతులు లేవని నోటీసులు ఇచ్చిన పంచాయతీ, ప్రభుత్వ స్థలం ఆక్రమించుకున్నారని రెవెన్యూ అధికారులు, కాలువలు కబ్జా చేశారని ఇరిగేషన్ అధికారులు నోటీసులు ఇచ్చారని ఏఈ తెలిపారు. విద్యుత్ కట్ చేయమంటేనే తాము వెళ్లామని ఇప్పుడు తమపై మాత్రమే చర్యలు తీసుకుంటే ఎలా? అని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'అన్న చెప్పాడు.. మేడం చెప్పారు' అని ఆలోచించకుండా సంతకాలు చేసి నోటీసులు ఇచ్చిన అధికారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

రాష్ట్రస్థాయిలో మాట్లాడుకోవాలి..

సస్పెండ్ చేసిన వెంటనే విద్యుత్ ఏఈ తోపాటు సిబ్బంది అందరూ ఆళ్లగడ్డ నియోజకవర్గ టీడీపీ ముఖ్య నేత దగ్గరకు వెళ్లి తమ గోడు వెళ్ల బోసుకున్నారు. 'మీరు చెబితేనే చేశాం కదా మా పరిస్థితి ఏంటి' అని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ ముఖ్యనేత జిల్లా విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ చేయగా.. 'ఇందులో మేమేమి చేయలేం. ఏదన్నా ఉంటే రాష్ట్రస్థాయిలో మాట్లాడుకోవాలి' అని తెలిపినట్లు సమాచారం.

విరిగిపడిన కొండచరియలు





శ్రీశైల డ్యాం సమీపంలో రోడ్డుపై విరిగిపడ్డ కొండచరియలు, ఎగువ అహోబిలంలో తెగిన విద్యుత్ తీగలు

శ్రీశైలం ప్రాజెక్ట్: కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో గురువారం డ్యాంకు సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. రోడ్డుపైనే కొండ చరియలు పడినా ఆ సమయంలో ఎలాంటి రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఇదిలాఉంటే గత కొద్ది వారాలుగా శ్రీశైలండ్యాం గేట్లు తెరచి నీటిని విడుదల చేస్తుండడంతో నీటి తాకిడికి డ్యాం పరిసర ప్రాంతాల్లోని కొండచరియలు బలహీన పడటం ఆందోళన కలిగిస్తోంది.

అహోబిలంలో .....

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో బుధవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడ్డాయి. దేవాలయం వెళ్లే మెట్లమార్గంలో కొండపై నుంచి భారీ బండరాయి విరిగి కిందపడింది. ఈ ప్రమాదంలో పెద్ద చెట్టు, కరెంట్ స్తంభం నేలమట్టమయ్యాయి. విద్యుత్ తీగలు తెగి దారికి అడ్డంగా పడ్డాయి. తెల్లవారు జామున భక్తులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

క్లుప్తంగా

నూర్పిడి యంత్రం బోల్తా పడి మహిళ మృతి

ప్యాపిలి: గుడిపాడు సమీపంలో గురువారం నూర్పిడి యంత్రం బోల్తా పడిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. గుడిపాడు గ్రామానికి చెందిన పలువురు కూలీలు ట్రాక్టర్‌కు అమర్చిన నూర్పిడి యంత్రంపై కూర్చుని పొలానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ట్రాక్టర్‌కు ఎదురుగా ఎడ్ల బండి అడ్డు రావడంతో ట్రాక్టర్ డ్రైవర్ ఎడ్ల బండిని తప్పించబోయాడు. ప్రమాదవశాత్తు నూర్పిడి యంత్రం బోల్తా పడటంతో అందులో ఉన్న ఉల్లి కళావతి (33)తో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన కళావతిని డోన్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె కోలుకోలేక మృతి చెందింది. కళావతికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చెల్లని చెక్కు ఇచ్చిన ఉపాధ్యాయుడికి జైలు

కర్నూలు: తీసుకున్న అప్పు చెల్లింపులో భాగంగా చెల్లని బ్యాంకు చెక్కు ఇచ్చిన ప్రభుత్వ ఉపాధ్యాయుడికి ఏడాది జైలు, చెక్కు మొత్తం జరిమానా చెల్లించాలని కర్నూలు ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ అనిల్ కుమార్ గురువారం తీర్పు చెప్పారు. కర్నూలు నగరానికి చెందిన కె.మనోహర్ అనే ఉపాధ్యాయుడి దగ్గర సహోద్యోగి ఎస్‌కే మద్దిలేటి 2020లో నాలుగు దఫాలుగా రూ.8 లక్షలు అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోట్లు రాసిచ్చాడు. ఆ అప్పు చెల్లింపులో భాగంగా 2021 మార్చి 12వ తేదీన రూ.9 లక్షల విలువైన బ్యాంకు చెక్కును మనోహర్‌కు ఇచ్చాడు. మనోహర్ తన బ్యాంకులో చెక్కు వేయగా మద్దిలేటి ఖాతాలో తగిన నిల్వ లేక చెక్ బౌన్స్ అయింది. దీంతో ఫిర్యాది తన న్యాయవాదులు చంద్రశేఖర్, నాగలక్ష్మిల ద్వారా కోర్టును ఆశ్రయించగా కేసు విచారించిన న్యాయాధికారి నిందితునికి జైలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

వేర్వేరు చోట్ల పాముకాటుతో ముగ్గురు మృత్యువాత

● పొలంలో పని చేస్తుండగా..



మృతిచెందిన మంగమ్మ (ఫైల్)

ఆలూరు రూరల్/ నందవరం: ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేర్వేరు చోట్ల పాముకాటుతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. వ్యవసాయ పనులు చేస్తుండగా పాముకాటుకు బలయ్యారు. ఆలూరు మండలంలోని కమ్మరచేడు గ్రామానికి చెందిన మంగమ్మ (45) బుధవారం ఉదయం పత్తి పొలంలో ఎరువులు చల్లేందుకు వెళ్లింది. ఎరువుల చల్లుతుండగా కాలుకు పాము కాటు వేసింది. బంధువులు గమనించి చికిత్స కోసం ఆదోని ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలికి భర్త మహానంది, ఇద్దరు సంతానం ఉన్నారు.

గడ్డి కోస్తుండగా..



మృతిచెందిన ఆంజనేయులు (ఫైల్)

మండల కేంద్రం నందవరంలో పాము కాటుకు గురై రైతు రాజోలి శ్రీఆంజనేయులు(37) బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ కేశవ తెలిపిన వివరాలు మేరకు..గ్రామంలో సోమవారం రైతు తన పొలంలో పశువులకు గడ్డి కోస్తుండగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు వైద్య సేవలందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. కర్నూలు సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవారం మృత్యువాత పడ్డాడు. మృతుడి తండ్రి పెద్దింటి చిన్న తిమ్మప్ప ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతిడికి భార్య శివమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

డోన్ టౌన్: వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన సతీష్‌కుమార్ (28)పాము కాటుకు గురై మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం వ్యవసాయ పనుల నిమిత్తం పొలంలో పని చేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. గ్రామంలో జరిగిన ఈ సంఘటన విషాదఛాయలు అములుకున్నాయి.

దోపిడీ ముఠా గుట్టు రట్టు!

● ముగ్గురి దొంగల అరెస్ట్



దోపిడీ ముఠా సభ్యుల అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: కర్నూలు శివారులోని జగన్నాథ గట్టు పైకి వెళ్లే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్న ముఠా గుట్టును కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు రట్టు చేశారు. ముజఫర్ నగర్‌కు చెందిన గోర్లగుట్ట నాగేంద్రుడు, టీవీ9 కాలనీలో నివాసముంటున్న కురువ రమేష్, దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన దూదేకుల మాలిక్ బాషా ముఠాగా ఏర్పడి జగన్నాథగట్టు పరిసర ప్రాంతాలకు వెళ్లే ప్రేమికుల ఫొటోలు, వీడియోలు తీసి వారిని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు లేదా విలువైన వస్తువులను తీసుకోవడం, ఇవ్వని వారిని చంపుతామని బెదిరింపులకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఈనెల 19వ తేదీ మధ్యాహ్నం ఒక అమ్మాయి తనకు తెలిసిన అబ్బాయితో ఆటోలో కర్నూలు-బెంగుళూరు జాతీయ రహదారి మీదుగా రాయలసీమ యూనివర్సిటీకి వెళ్తుండగా ముఠా సభ్యులు గుర్తించారు. మార్గమధ్యలో హ్యాంగౌట్ హోటల్ దాటిన తర్వాత ఆటోను ఆపి అందులో ఉన్న అమ్మాయి, అబ్బాయి ఫొటో తీసి 'మీ తల్లిదండ్రులకు పంపుతాం' అంటూ కత్తితో బెదిరించారు. అమ్మాయి నుంచి బంగారు గొలుసు, అబ్బాయి నుంచి ఫోన్‌పే ద్వారా రూ.2 వేలు, జేబులో రూ.వెయ్యి లాక్కుని ఉడాయించారు. తిరిగి రెండు రోజుల తర్వాత అమ్మాయికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దోపిడీ ముఠా నుంచి వచ్చిన ఫోన్ నంబర్ ఆధారంగా నిందితులు స్థానిక కైరా కేఫ్ వద్ద ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10,500 నగదు, బంగారు చైన్, మూడు మొబైల్ ఫోన్లు, ఒక కారు, స్కూటీ, కత్తితో పాటు 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు నాలుగో పట్టణ సీఐ విక్రమసింహ తెలిపారు. పట్టణ శివారులో ప్రేమ జంటలు, స్త్రీ పురుషులు కాని ఏకాంతంగా గడపటం కోసం వెళ్లి ఇలాంటి వారి బారిన పడి ఇబ్బందులకు గురికావద్దని సూచించారు. ఎవరైనా అలా బెదిరింపులకు పాల్పడితే డయల్ 112 లేదా 9121101062కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సీఐ తెలిపారు.

జెడ్పీలో గణనాథునికి చైర్మన్ పాపిరెడ్డి పూజలు



పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, ఉద్యోగులు

కర్నూలు(అర్బన్): వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన గణనాథునికి బుధవారం జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, చైర్మన్ సీసీ అశ్వినీకుమార్, జెడ్పీలోని వివిధ విభాగాలకు చెందిన పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ.. వినాయకచవితి పర్వదినం సందర్భంగా అందరికి శుభాలు కలగాలని, చేపట్టిన కార్యక్రమాలన్ని విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా ఆ విఘ్నేశ్వరున్ని ప్రార్థించడం జరిగిందన్నారు.

స్మార్ట్ మీటర్లను తొలగించకపోతే మరో పోరాటం

కర్నూలు(సెంట్రల్): విద్యుత్ స్మార్ట్ మీటర్లను తీసివేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన బాబు మాట తప్పారన్నారు. వెంటనే స్మార్ట్‌మీటర్లను తొలగించకపోతే మరో విద్యుత్ పోరాటానికి సిద్ధమవుతామని వామపక్ష పార్టీల నేతలు హెచ్చరించారు. బుధవారం సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట 25 ఏళ్ల క్రితం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రామకృష్ణ, విష్ణువర్దన్, బాలస్వాముల చిత్రపటాలకు సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు డి.గౌస్‌దేశాయ్, బి.గిడ్డయ్య పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని 2000లో పోరాటం చేస్తున్న ఉద్యమకారులపై పాశవికంగా కాల్పులు జరిపించి ముగ్గురు ఉద్యమకారుల ప్రాణాలను బలిగొన్న దుర్మార్గుడు చంద్రబాబునాయుడని విమర్శించారు. ప్రపంచ బ్యాంకు సంస్కరణలు, విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా అప్పటి ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడితే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉండి అణచి వేశారన్నారు. ముగ్గురు ప్రాణాలను తీసుకోవడమే కాక అనేక మంది గాయల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న చంద్రబాబు తీరేమి మారలేదన్నారు. కూటమి ప్రభుత్వం 14 నెలల కాలంలో దాదాపు రూ. 20 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారీన్ని ప్రజలపై మోపిందన్నారు. మరిన్ని విద్యుత్ చార్జీలు పెంచేందుకు సిద్ధమవుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రాధాకృష్ణ, ఆనంద్‌బాబు, రాజశేఖర్, సీపీఐ నాయకులు జగన్నాథం, రామకృష్ణ, లెనిన్‌బాబు, మునెప్ప పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో పలువురికి పదవులు దక్కాయి. నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో పలువురిని వివిధ హోదాల్లో నియమిస్తూ గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.మోతే చిన్న వీరేష్ (రాష్ట్ర విద్యార్థి విభా గం సంయుక్త కార్యదర్శి) వంగాల మేఘనాథ్ రెడ్డి (రాష్ట్ర వలంటీర్ల విభాగం కార్యదర్శి) గడ్డం కేశవ రెడ్డి (రాష్ట్ర బూత్ కమిటీ విభాగం సంయుక్త కార్యదర్శి)లను నియమించింది.

పంచాయతీరాజ్ ఎస్ఈగా వేణుగోపాల్

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీరు(ఎస్ఈ)గా ఐ.వేణుగోపాల్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో ఈఈలుగా పనిచేస్తున్న 15 మందికి ఎస్ఈలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్‌కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే ఖాళీగా ఉన్న ఎస్ఈ పోస్టులో ప్రకాశం జిల్లా ఈఈగా విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్‌ను నియమించింది. అలాగే కర్నూలులో ఈఈగా పనిచేస్తున్న ఎస్.సి.ఈ.మద్దన్నను కడప ఎస్ఈగా, మరో ఈఈ ఎం.రామ్మోహన్‌ను సీఆర్‌డీఏకు, వై.చిన్నసుబ్బరాయుడును అనంతపురం ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రైతు కొట్టం రామానాయుడు (ఫైల్)

వెల్దుర్తి: రామళ్లకోట గ్రామానికి చెందిన రైతు కొట్టం రామా నాయుడు (33) బుధవారం విద్యుదా ఘాతంతో మృతి చెందాడు. ఉదయం తన భార్య పద్మావతితో కలిసి గ్రామానికి దూరంగా ఉన్న కొండ పొలానికి వెళ్లాడు. సాగు చేసిన మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు బోరు మోటార్ ఆన్ చేశాడు. సాయంత్రం ముందుగానే భార్య ఇంటికి వెళ్లగా, నీళ్లు కట్టడం పూర్తయిన తర్వాత వస్తానని చెప్పిన భర్త పొద్దుపోయినా రాకపోవడంతో ఆమె ఆందోళన చెందింది. కుటుంబీకులతో కలసి పొలం వద్దకు వెళ్లి చూడగా రామానాయుడు అపస్మారక స్థితిలో పడిపోయాడు. బోర్ మోటార్ ఆఫ్ చేసే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురైనట్లు గుర్తించారు. వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి కు మారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు కుటుంబీకులకు అప్పగించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

నేటి నుంచి తెలుగు భాషా దినోత్సవ వేడుకలు

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 31వ తేదీ వరకు తెలుగు భాషా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య పేర్కొన్నారు. గురువారం కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో నాటక రంగం చరిత్రంలో ఇలాంటి కార్యక్రమం జరగలేదని అందుకే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు కార్యక్రమాన్ని తమ రికార్డ్స్‌లో నమోదు చేయనుండటం జిల్లాకు జిల్లా కళాకారులకు దక్కిన గొప్ప గౌరవమన్నారు. 31వ తేదీ ఉదయం 10.30 గంటలకు తాను రచించిన పదవి మూలం ఇదం జగత్ అధి'కారము' పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. సాయంత్రం 6.30 గంటలకు వ్యాసరచన పోటీల విజేతలు, ఏకపాత్రాభినయం పోటీల విజేతలు ఇతర కళాకారులు మొత్తం 150 మందికి సన్మానం ఉంటుందన్నారు.

'టోలు'తీస్తా జాగ్రత్త!

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి సోదరుడుని దౌర్జన్యం
● టోల్‌గేట్ అసిస్టెంట్ మేనేజర్‌పై దాడి



దాడి అనంతరం జీపులో వెళ్తున్న టీడీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అధికారం చేతిలో ఉందని టీడీపీ నాయకులు రెచ్చిపోతున్నారు. అడ్డొచ్చిన వారు ఎవరైనా దౌర్జన్యానికి తెగబడుతున్నారు. ఓ స్థాయి నేతలే కాదు, వాళ్ల కుటుంబ సభ్యులు సైతం దురుసుగా ప్రవర్తిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. రూ.30 టోల్‌గేట్ కూడా చెల్లించలేని స్థితిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి సోదరుడు శ్రీనివాసు రెడ్డి ఏకంగా టోల్‌గేట్ ఉద్యోగిపై దాడికి పాల్పడటం గమనార్హం. నందవరం మండల పరిధిలోని 167వ జాతీయ రహదారిలోని ధర్మపురం టోల్‌గేట్ వద్ద శ్రీనివాసరెడ్డితో పాటు ఆయన అనుచరులు గురువారం మధ్యాహ్నం మంత్రాలయం వైపు జీపులో వెళ్లారు. అయితే టోల్‌గేట్ వద్ద ఆటోమెటిక్‌గా ఫాస్టాగ్‌లో రూ.30 డెబిట్ కావడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. తన వద్దే టోల్ వసూలు చేస్తారా అంటూ అసిస్టెంట్ మేనేజర్ కుల్‌దీప్ యాదవ్‌పై దాడికి పాల్పడ్డారు. శ్రీనివాసరెడ్డితో పాటు జీపు డ్రైవర్, తన అనుచరుడు కలిసి కుల్‌దీప్ యాదవ్‌పై చేయి చేసుకున్నారు. అయితే టోల్‌గేట్ సిబ్బంది అక్కడ గుమికూడటంతో శ్రీనివాసరెడ్డి మంత్రాలయం వైపునకు వెళ్లిపోయాడు. ఈ విషయమై ఎస్ఐ కేశవను 'సాక్షి' వివరణ కోరగా తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.